క్లుప్తంగా

హైవేపై వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ ఆంజనేయులు

మునగాల : మునగాల వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి మునగాల సీఐ పి.ఆంజనేయులు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా హైవేపై ప్రయాణించే పలు వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మునగాల, నడిగూడెం, మోతె ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణపురం.. ఆదర్శ గ్రామం



సర్పంచ్ శంకర్‌ను సన్మానిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ, తదితరులు

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామ పంచాయతీ జాతీయ పంచాయతీ అవార్డులో మండల స్థాయిలో అన్ని విభాగాల్లో ప్రథమ స్థానం సాధించింది. దీంతో మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ తమ్మనబోయిన శంకర్, గ్రామ కార్యదర్శి సారికను గ్రామస్తులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఈదయ్య మాట్లాడుతూ.. నారాయణపురం గ్రామం ఆదర్శ గ్రామమని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీఓ పాండుయాదవ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పల్లెపల్లెకు ఓబీసీ, గడపగడపకు బీజేపీ

నడిగూడెం : మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం పల్లెపల్లెకు ఓబీసీ, గడపగడపకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బొలిశెట్టి కృష్ణయ్య మాట్లాడుతూ ఓబీసీ కమిషన్ ఏర్పాటు చేసి, దానికి రాజ్యాంగబద్ధత కల్పించిన మొదటి ప్రధాని నరేంద్ర మోదీ అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ కోదాడ అసెంబ్లీ కోఆర్డినేటర్ మునగాల శ్రీనివాస్, దేవరశెట్టి సత్యనారాయణ, రెడ్డిపల్లి రాముడు, రాంపల్లి వెంకట్, లతీఫ్, వంగవీటి శ్రీనివాసరావు, కొండ్లె రవికుమార్ పాల్గొన్నారు.

9న వామపక్ష పార్టీల సమావేశం

పాలకవీడు : హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 9న నిర్వహించబోయే సీపీఐ, సీపీఎంల రాష్ట్ర స్థాయి సంయుక్త సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.ధనుంజయనాయుడు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆ పార్టీ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలిరావాలన్నారు. ఆయన వెంట పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

రాగి జావ పంపిణీ

హుజూర్‌నగర్ : పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రంలో బుధవారం దాత ఎస్‌సీఎల్ రంగరాజు అందించిన రాగిజావను వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో 300 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

కంకర మిల్లు తొలగింపును అడ్డుకున్న గ్రామస్తులు

నడిగూడెం : మండల పరిధిలోని కాగితరామ చంద్రాపురం వద్ద సాగర్ కాల్వ వెంట ప్రభుత్వ స్థలంలో ఉన్న పాలకాలం నాటి లక్షల రూపాయల విలువైన కంకర మిల్లును ఆ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి శ్మశాన వాటిక ప్రహరీకి అడ్డు వస్తుందని మంగళవారం తొలగిస్తుండడంతో నీటి పారుదల శాఖ అధికారుల అనుమతి లేకుండా ఎలా తొలగిస్తారని ఆ గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ విషయంపై డీఈ ఆనంద్‌ను వివరణ కోరగా కంకర మిల్లును తొలగించమని ఎలాంటి అనుమతి ఇవ్వలేదని చెప్పారు.

టీబీపై అప్రమత్తత అవసరం



టీబీ క్యాంపును పరిశీలిస్తున్న మండల వైద్యాధికారి డాక్టర్ ప్రేమ్‌సింగ్

మేళ్లచెరువు : టీబీ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రేమ్‌సింగ్ సూచించారు. మంగళవారం మండలంలోని వేపలమాధవరం గ్రామంలో ఏర్పాటు చేసిన క్షయవ్యాధి నిర్ధారణ క్యాంపును ఆయన పరిశీలించి మాట్లాడారు. రెండు వారాలకు మించి దగ్గు వచ్చిన సాయంత్రం సమయంలో జ్వరం వచ్చిన, బరువు తగ్గిన, ఆకలి మందగించిన వెంటనే ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆయన వెంట డీపీఎంఓ సురేష్, సీహెచ్‌ఓ కృష్ణయ్య, రాములు, వైద్య సిబ్బంది కిరణ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసరెడ్డి, లక్ష్మి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా పంట దిగుబడి

- ఎకరానికి 40 బస్తాల పైనే..
- సన్నాలకు రూ. 2350, దొడ్డు రకానికి రూ. 1800 ధర
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

కోదాడరూరల్ : ఈ యాసంగి వరి సాగు ఆశించిన దిగుబడి, మంచి ధర ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సీజన్‌లో వరికి తెగుళ్ల సోకడం, ధర ఉంటే దిగుబడి లేకపోవడం, దిగుబడి ఉంటే ధర లేకపోవడంతో రైతుల కష్టాలు వర్ణనాతీతంగా ఉండేవి. కానీ ఈ యాసంగిలో మాత్రం ఆ రెండు కూడా ఆశాజనకంగా ఉన్నాయని రైతులు అంటున్నారు. సన్న రకాల పచ్చి వడ్లకు క్వింటాల్‌కు రూ.2300 లకు పైగా ధర ఉందని, దొడ్డు రకాలకు రూ.1800 పైగా ధర ఉందని చెబుతున్నారు. ఇక దిగుబడి కూడా ఎకరానికి 40 బస్తాలకు తగ్గకుండా వస్తుందని రైతులు అంటున్నారు.

డివిజన్‌లో లక్ష ఎకరాలకు పైగా సాగు..

కోదాడ డివిజన్‌లో లక్షా 29 వేల 280 ఎకరాల్లో వరి సాగు నమోదు అయినట్లు అధికారులు చెబుతున్నారు. అత్యధికంగా కోదాడ మండలంలో 26 వేలు, అనంతగిరి మండలంలో 25 వేలు, చిలుకూరు మండలంలో 23 వేల ఎకరాల్లో వరి సాగయినట్లు చెప్పారు. అయితే వ్యవసాయాధికారులు వరితో పాటు ఇతర పంటలను కూడా సాగు చేయాలని చెబుతున్నప్పటికీ ఎక్కువ శాతం రైతులు మాత్రం వరి సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. అందుకు కారణం వరి సాగుకు ఇతర పంటలతో పోల్చితే శ్రమ తక్కువగా ఉండటం, రూ.2 వేల వరకు మద్దతు ధర ఉండటమేనని రైతులు అంటున్నారు. వరి సాగులో తగు చర్యలు తీసుకొని మందులు స్ప్రే చేసుకోవడం, సమయానికి కలుపు తీసుకోవడం, నీటి యాజమాన్య పద్ధతులు పాటిచడంతో తెగుళ్లు కూడా తక్కువేనని ఆయా గ్రామాల రైతులు అంటున్నారు.



గణపవరంలో సాగు చేసిన వరి

సన్నాలకు మంచి ధర..

ప్రస్తుతం డివిజన్ పరిధిలోని యాసంగి కోతలు ప్రారంభయ్యాయి. ఈ ప్రాంత రైతులు ఎక్కువగా చింట్లు, హెచ్‌ఎంటీలతో పాటు 1010 రకం వరి సాగు చేపట్టారు. అయితే ఆరబెట్టిన ధాన్యానికి క్వింటాకు ప్రభుత్వ మద్దతు ధర రూ.2060 ఉంది. కానీ రైతులు పంట కోసిన వెంటనే పచ్చి ధాన్యాన్ని కమీషన్‌దారులు ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. హెచ్‌ఎంటీ పచ్చిధాన్యాన్ని నాణ్యతను బట్టి హెచ్‌ఎంటీకి క్వింటా రూ.2300 నుంచి రూ.2400 వరకు, చింట్లు రకాన్ని రూ. 2350 నుంచి రూ.2400 వరకు, 1010ను క్వింటా రూ.1800 రూ.1850 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఆరబెట్టి అమ్ముకుంటే క్వింటాకు మరో రూ.250 నుంచి రూ.300 వరకు అదనంగా వస్తాయని కానీ ఆ శ్రమంత ఎవరు పడతారని కోసిన వెంటనే కల్లం వద్దనే రైతులు కాంటాలు వేసుకుంటున్నారు.

ఇదే ధర ఉంటే రైతులకు లాభం



యాసంగిలో సాగు చేసిన సన్నాలకు మంచి ధర ఉంది. దిగుబడి కూడా 40 బస్తాలకు పైగానే వస్తుంది. పచ్చి వడ్లకే క్వింటాకు రూ.2400 వరకు ఉంది. వడ్లకు మున్ముందు కూడా ఈ విధంగా ధర ఉంటే రైతులకు లాభం ఉంటుంది.

– కొప్పుల శ్రీనివాసరెడ్డి, రైతు, రామలక్ష్మీపురం

తెగుళ్ల బెడద తక్కువే..



ఈ యాసంగి వరిసాగులో తెగుళ్ల బెడద గతంతో పోల్చుకుంటే తక్కువే. యాజమాన్య పద్ధతులు పాటించడం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో తెగుళ్లపై ఏఈఓలు ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కలిగిస్తున్నాం. రైతులు కూడా సాగుపై శ్రద్ధ పెట్టడంతో దిగుబడి పెరిగింది.

– పాలెం రజిని, ఏఓ, కోదాడ

పాఠశాలల బలోపేతానికి 'మన ఊరు–మన బడి'

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

మఠంపల్లి : రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికే ప్రభుత్వం మన ఊరు– మన బడి పథకాన్ని ప్రవేశపెట్టి కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని బక్కమంతులగూడెంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మన ఊరు –మనబడి పథకంలో భాగంగా రూ.70 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. మన ఊరు – మన బడితో పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత పూర్తిగా తీరిపోనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు ఇస్తున్న పౌష్టికాహారం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పార్వతీకొండానాయక్, జెడ్పీటీసీ జగన్‌నాయక్, హుజూర్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్‌లు మన్నెం శ్రీనివాసరెడ్డి, బేత విజయకుమారివెంకటరెడ్డి, ఎంపీటీసీ చింతారెడ్డి నాగిరెడ్డి, ఎంపీడీఓ జానకిరాములు, ఎంఈఓ చత్రునాయక్, మాజీ ఎంపీపీ మామిడి సోమమ్మశ్రీనివాస్, పుల్లారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.



బక్కమంతులగూడెంలో మన ఊరు-మనబడి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

సంక్షేమ పథకాలు అందేలా చూస్తా

హుజూర్‌నగర్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులకులందరికీ అందేలా చూస్తానని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ బజార్ హమాలీ (బీఆర్‌ఎస్ అనుబంధ) సంఘం సభ్యులు ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో కలిసి సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నియోజవర్గ అధ్యక్షుడు పి.ఉపేందర్, నాయకులు బాలకృష్ణ, నరసింహారావు, నాగరాజు, లింగయ్య, వెంకన్న, రామయ్య, కోటయ్య, వీరబాబు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

రఘునాథపాలెంలో ముగిసిన ఎద్దుల పందేలు

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెంలో శ్రీరామనవమి వేడుకలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఎద్దుల పందేలను చివరిరోజైన మంగళవారం రాత్రి మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తిరుమలశెట్టి అప్పయ్య ప్రారంభించారు. ఈ పోటీలలో జూనియర్స్ విభాగంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 6 జతలు పోటీ పడ్డాయి. కాగా విజేతలకు ఎన్‌ఆర్‌ఐ బొగ్గుల మౌలాలి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 5 బహుమతులకు గాను రూ.1. 50 లక్షలను అందజేశారు. అంతకుముందు మూడు రోజుల వరకు జరిగిన పోటీల్లో విజేతలకు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్నగౌడ్ బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, డీసీసీబీ డైరెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రయ్య, నాయకులు బొబ్బా సీతారామిరెడ్డి, రవీందర్‌రెడ్డి, చౌదరిరెడ్డి, వెంకటనారాయణ, యాదగిరికోటయ్య, అచ్చయ్య, సామేలు, భద్రారెడ్డి, నాగుల్‌మీరా, జమీల్, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్నగౌడ్

పకడ్బందీగా 'పది' పరీక్షల నిర్వహణ

చిలుకూరు : చిలుకూరులో పదవ తరగతి హిందీ పరీక్షను మంగళవారం పకడ్బందీగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను రెవెన్యూ అధికారులు సిబ్బందితో తనిఖీ చేయించి పరీక్ష కేంద్రంలోకి పంపించారు. రెండోరోజు చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకరు, గ్లోబస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఒకరు చొప్పున ఇద్దరు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తాడువాయి శివారులోని సెయింట్ ఆన్స్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాలను మంగళవారం మునగాల సీఐ పి.ఆంజనేయులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్‌ఐ పి.లోకేష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



చిలుకూరు : పదో తరగతి విద్యార్థులను తనిఖీ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రశాంతంగా పరీక్షలు

హుజూర్‌నగర్ : పట్టణంలో 4 కేంద్రాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఈ కేంద్రాలలో 744 మంది విద్యార్థులకు గాను 742 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని అధికారులు తెలిపారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

- మాజీ ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ : ప్రజాసమస్యలను పరిష్కరించేది కాంగ్రెస్ పార్టీయేనని, అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి కోరారు. మంగళవారం కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ పార్టీ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వంగవేటి రామారావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

కేంద్రానివి ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు

గరిడేపల్లి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ ఆరోపించారు. మంగళవారం మండలంలోని కట్టవారిగూడెంలో జరిగిన మహిళా కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతిలో ఈనెల 16, 17, 18 తేదీలలో జరిగే ఐఎఫ్‌టీయూ అఖిల భారత 7వ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈ సంఘం నాయకులు ఉపేంద్ర, వీరబాబు, మీసాల నాగమణి, ఎల్లమ్మ, మరియమ్మ, వీరమ్మ, కనకమ్మ, జ్యోతి, కామేశ్వరమ్మ, సత్యావతి తదితరులు ఉన్నారు.



నినాదాలు చేస్తున్న జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్, మహిళలు

పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

గరిడేపల్లి : పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని, 56 శాతం ఉన్న బీసీలకు అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు రాంబాబుగౌడ్ అన్నారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు అధిక సీట్లు కేటాయించిన వారికి తమ మద్దతు ఇవ్వడం జరుగుతుందన్నారు. బీసీలను రాజకీయంగా అణగతొక్కుతున్నారని ఆరోపించారు. కుల గణనలో బీసీల లెక్కలను తీయాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు యల్లావుల వెంకన్న, శేఖర్, హుస్సేన్ తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ఆందోళన

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని తమ్మరలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ రైతులు కోదాడ – ఖమ్మం రహదారిపై మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీపీఐ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లు ప్రసాద్ మాట్లాడుతూ కోతలు ప్రారంభమై 15 రోజులు కావస్తున్న కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దొడ్డు రకం ధాన్యం సాగు చేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆరబోసుకొని అమ్ముకునేందుకు సిద్ధంగా ఉన్నారని సంబంధిత అధికారులను సంప్రదిస్తే వారి నుంచి ఎలాంటి స్పందన లేదని, అందుకే ఆందోళనకు దిగామని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు కమతం వెంకటేశ్వరరావు, బాబు, కొండయ్య, గిరి, సుబ్బారావు, కిరణ్‌రెడ్డి, పుల్లయ్య ఉన్నారు.



కోదాడ- ఖమ్మం రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

శాస్త్రోక్తంగా తిరుకల్యాణ అధ్యయనోత్సవాలు



స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో తిరుకల్యాణ అధ్యయనోత్సవాలను అర్చకులు మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, స్వామి అమ్మవార్లకు ఆరాధన, దివ్య ప్రబంధ పారాయణం, ఇలగింపు, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, సాయంత్రం దివ్య ప్రబంధ పారాయణం, స్వామి అమ్మవారిని ఆళ్వారాదులను దేవాలయం చుట్టూ ప్రదక్షిణం చేసిన అనంతరం కొఠారి ప్రవేశం, మంగళాశాసనం, తీర్థ ప్రసాద వినియోగం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ ఎంపీ లక్ష్మణరావు, ధర్మకర్తలు సురబీ కుషల్, పవన్‌కుమార్, గురవయ్య, రామకృష్ణ, మట్టపల్లి, అంజమ్మ, కొత్త కళావతి, కిరణ్‌గౌడ్, అర్చకులు ముడుంబై శ్రీనివాసాచార్యులు, అనంతరచార్యులు, మనోహరచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వసతుల కల్పనకు ఎమ్మెల్యే కృషి



లాల్‌లక్ష్మీపురంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య

నేరేడుచర్ల : మండలంలోని కల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని లాల్ లక్ష్మీపురంలో మంగళవారం ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే సైదిరెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, సర్పంచ్ పల్లెపంగ నాగరాజు, ఎంపీటీసీ నందిపాటి నాగవేణిగురువయ్య, గ్రామ కార్యదర్శి పద్మ, నాయకులు నాగరాజు, రాంబాబు, సతీష్, శ్రీనివాస్, రవి, నరేష్, వినోద్, లచ్చయ్య, చంద్రగిరి, సైదులు, గోపి, నిఖిల్ తదితరులున్నారు.

'ఇంటింటికి సీపీఐ'ని జయప్రదం చేయాలి

గరిడేపల్లి : బీజేపీ హటావో–దేశ్‌కి భచావో అనే నినాదంతో ఈ నెల 14వ తేదీ నుంచి చేపట్టబోయే ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన మండల పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవస్థలన్నింటినీ ప్రధాని మోదీ తన గుప్పెట్లో పెట్టుకొని నిరంకుశంగా వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. సీపీఐ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కేంద్రం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, అప్పయ్య, రాజిరెడ్డి, ఆంజనేయులు, తిరుతయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు

ఏఎంసీ చైర్ పర్సన్‌కు సన్మానం



లక్ష్మమ్మను సన్మానిస్తున్న మత్స్య సొసైటీ సభ్యులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్‌పర్సన్ దొంతగాని లక్ష్మమ్మను వారి కుమారుడు మున్సిపల్ మాజీ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్‌ను పట్టణ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు మంగళవారం శాలువా, పూలమాలతో సన్మానించారు. అలాగే గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దొంతగాని లక్ష్మమ్మను సన్మానించారు. కార్యక్రమంలో మత్స్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శీలం శ్రీనివాస్, చింతకాయల రాము, సభ్యులు నరసయ్య, మల్ల య్య, వెంకన్న, గోపమ్మ, యశోద, నాగేశ్వరరావు, సీతారాములు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష పేపర్ల లీకేజీపై సీపీఎం నిరసన



గరిడేపల్లిలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

గరిడేపల్లి : పదవ తరగతి పరీక్ష పేపర్ల లీకేజీలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం గరిడేపల్లిలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కే యాకుబ్ మాట్లాడుతూ 10వ తరగతి రెండు పరీక్ష పేపర్ల లీక్‌కు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరీక్ష పేపర్లు లీక వుతుండటంతో విద్యార్థులు ఆయోమయంలో పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హుస్సేన్, నారాయణరెడ్డి, నాగరాజు, సత్యం, ప్రశాంత్, చంద్రయ్య, పాండు నాయక్, శ్రీను, నరసయ్య, రాములు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం



మఠంపల్లి : బాడవాతండాలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్

మఠంపల్లి : కంటి వెలుగు కేంద్రాల్లో ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకుని అవసరమైన వారు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న కళ్లద్దాలను పొందాలని జెడ్పీటీసీ జగన్‌నాయక్ కోరారు. మంగళవారం మండలంలోని బాడవాతండాలో స్థానిక సర్పంచ్ దారావత్ గోవింద్‌నాయక్‌తో కలిసి ఆయన కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాలునాయక్, డాక్టర్ కల్యాణి, వైద్య, ఆశ, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే కేసీఆర్ లక్ష్యం

పాలకవీడు : అంధత్వ నివారణే ధ్యేయంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని హనుమయ్యగూడెం సర్పంచ్ సరిత ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆ గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ దయాకర్, వైద్యులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమస్యలు పరిష్కరించాలి

నడిగూడెం : మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నర్సరీ, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న 10వ తరగతి పరీక్షలను పరిశీలించారు. కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో నూతనంగా ఆరు నర్సరీలు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీడీఓ యం,యర్రయ్య, ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, ఏపీఓ నగేష్, తదితరులు ఉన్నారు.



నడిగూడెంలో నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్‌కుమార్

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

సూర్యాపేట రూరల్ : రోజు వారి ఆహారంలో చిరుధాన్యాలను అలవాటు చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కేటీ అన్నారం గ్రామంలో జిల్లా సంక్షేమ అధికారి జ్యోతిపద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి



మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

అనంతగిరి : మండల ప్రజలు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని త్రిపురవరం వైద్యాధికారిణి లక్ష్మీప్రసన్న అన్నారు. మంగళవారం త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా పలువురు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళలకు 57 రకాల రక్త, మూత్ర పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సమస్యలు ఉన్న మహిళలు ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డా.రాగ మోనిక, సిబ్బంది కళావతి, విజయకుమార్, శ్రీదేవి, శైలజ, మహేష్, మంజుల, రాధ, ఝంగ, మహేశ్వరి, గీత, పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

14 నుంచి జనచైతన్య యాత్ర

హుజూర్‌నగర్ : చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ కోరారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 14 నుంచి మే 14 వరకు సీపీఐ ఆధ్వర్యంలో జన చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ విభజన హామీలు అమలు చేయాలని, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు గుండు వెంకటేశ్వర్లు, యల్లావుల రాములు, జక్కుల శ్రీనివాస్, రమణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్